ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్‌: జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు.

☆ జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత నివాసం వద్ద కాంగ్రెస్ నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రజా సంఘాల నాయకులు స్థానిక స్మృతివనంలో అమరవీరుల స్థూపం దగ్గర నివాళులర్పించారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయుడు జెండా ఎగురవేశారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస రావు జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు.

– ఎర్రవల్లి మండల కేంద్రంలోని బీచుపల్లి పదో పటాలంలో కమాండెంట్ జయరాజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. గాంధీజీ, సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

☆ అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ దొడ్డెన్న, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలంపూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ శంకర్, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ పద్మావతి, ఎస్‌ఐ వెంకటస్వామి జెండాను ఎగురవేశారు.

☆ కేటీదొడ్డిలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ రమణరావు, రైతు ఏఓ రాజవర్ధన్‌రెడ్డి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఎంపీఓ కృష్ణమోహన్, ఆర్‌ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

☆ ధరూరు మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో త్రివర్ణ జెండా ఎగురవేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ మంజుల తదితరులు పాల్గొన్నారు.

☆ మల్దకల్‌లో తహసీల్దార్ ఝాన్సీరాణి, డాక్టర్ స్వరూపరాణి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంట్లు కరీం తదితరులు పాల్గొన్నారు.

☆ ఇటిక్యాలలో ఏఓ రవికుమార్, ఎంపీడీఓ అజార్‌మొహియుద్దీన్, డాక్టర్ వినయ్, డాక్టర్ రాధిక, ఎస్‌ఐ రవినాయక్, తహసీల్దార్ వీరభద్రప్ప జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

☆ అయిజలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి త్రివర్ణ పథాకాన్ని ఎగురవేశారు.

☆ మానవపాడులో తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, ఎంపీడీఓ రాఘవ, సీడీపీఓ సుజాత, ఎస్‌ఐ చంద్రకాంత్ ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్నారు.

☆ ఎర్రవల్లిలో సింగిల్ విండో అధ్యక్షుడు రంగారెడ్డి, తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ అబ్దుల్ సయ్యద్‌ఖాన్ వివిధ పార్టీల నాయకులు జాతీయ జెండాను ఎగుర వేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

☆ రాజోళి మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేసి సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్, ఎస్‌ఐ గోకారి, ఎంపీఓ ఖాజా మెయినుద్దీన్ పాల్గొన్నారు.

☆ గట్టులో ఎంపీడీఓ చెన్నయ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్‌ఐ మల్లేష్, కార్యదర్శి కుర్మన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్యకళ, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్ జాతీయ పతకాలను ఎగురవేశారు.



అలంపూర్‌లో..



కేటీదొడ్డిలో..



గద్వాలలో ..

విమోచన దినోత్సవం

గద్వాలటౌన్/అయిజ: జిల్లా కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం వేర్వేరుగా విమోచన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఎగురవేశారు. స్థానిక డీకే బంగ్లాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు అప్సర్‌పాష, రవికుమార్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో తెలంగాణ విమోచన దినోత్సవంలో బీజేపీ నాయకులు

ఏబీవీపీ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో జాతీయ జెండా ఎగురవేశారు.

☆ అయిజ పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.

కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో..

మానవపాడు: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు అన్నారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్ కూడలిలో తెలంగాణ విలీన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్లుప్తంగా

చదరంగం బోర్డుల పంపిణీ



కేటీదొడ్డి: పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం చెస్ నెట్‌వర్క్స్ టీం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 160 చదరంగం బోర్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం ప్రతినిధి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలోచన, శక్తి సామర్థ్యాలను చెస్ ద్వారా అలవర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా చెస్ బోర్డులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమంతు, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, శ్రీపాదరెడ్డి, హెచ్‌ఎం రవిబాబు, ప్రతాప్‌రెడ్డి, హన్మిరెడ్డి, యుగంధర్, కిరణ్ పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 160 చెస్‌బోర్డులు పంపిణీ చేశారు. ఎన్నారై ఫోరం ప్రతినిధి మహిపాల్ రెడ్డి హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్ర బాబు, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ మురుగన్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ

గట్టు: అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్దకల్ ప్రాజెక్టు ఏసీడీపీఓ ఆకాష్ దీప్తి మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సంధ్యారాణి, పుష్ప, సరోజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి ప్రధానం



గద్వాలటౌన్: గెలుపోటముల కంటే పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం ప్రధానమని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. బుధవారం స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బాలురు, బాలికలకు వేర్వురుగా జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన 20 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి తుది జట్టును ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నర్సింహ, చైర్మన్ అబ్రహం, కోశాధికారి చందు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాలటౌన్: స్థానిక ఫొటోగ్రఫీ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ జరిగిన జిల్లా సమావేశంలో జిల్లా, పట్టణ ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున్, పట్టణ అధ్యక్షుడిగా బాలు, గౌరవ అధ్యక్షులుగా సిద్ధప్ప, కృష్ణమరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ బండల వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు గట్టులో ప్రజావేదిక

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి గురువారం మండల కేంద్రంలోని ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేపట్టిన పనులకు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో ఆడిట్ నిర్వహించారన్నారు. డీఆర్డీఓ, మండలస్థాయి అధికారులు హాజరు కానున్నట్లు ఏపీఓ పేర్కొన్నారు.

అపార్ ఐడీ తప్పనిసరి



శాంతినగర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సంబంధించి అపార్ ఐడీ తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంఈఓ నరసింహ అన్నారు. వడ్డేపల్లి ఎమ్మార్సీ భవనంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఉపాధ్యాయుడు ఎఫ్ఆర్‌ఎస్‌లో హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని, మూమెంట్ రిజిస్టర్ మెయింటేన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు నగేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సర్వేలో ఏఈఓలదే కీలకపాత్ర



కంది పంట పరిశీలిస్తున్న సక్రియానాయక్

రాజోళి: ప్రతి క్లస్టర్‌లో చేస్తున్న డిజిటల్ సర్వేలో ఏఈఓలదే కీలకపాత్ర అని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఏఈఓ బిందు చేస్తున్న డిజిటల్ సర్వేను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ప్రతి ఒక్క ఏఈఓ తమ పరిధిలోని 2 వేల ఎకరాల విస్తీర్ణానికి డిజిటల్ సర్వేను పూర్తి చేయాలన్నారు. విధిగా పొలాల వద్దకు వెళ్లి సాగులో ఉన్న పంటలను పరిశీలించి ఫొటోలను డీసీఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రైతులకు పంటల సాగులో మెళకువలు తెలియజేయాలని సూచించారు. అనంతరం ఆగ్రోస్ 1, 2 కేంద్రాలను తనిఖీ చేసి యూరియా పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి



ధరూరు: కిశోర బాలికలు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ మంజుల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, ఐకేపీ సిబ్బందితో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కిశోర బాలికలు వారి సమస్యలను చర్చించుకోవడానికి వేదికగా ఉంటుందన్నారు. మొబైల్ వాడకం వల్ల కలిగే నష్టాలు, లాభాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

అయిజ: నూతనంగా విధులు చేపట్టిన గ్రామ పంచాయతీ అధికారులు పారదర్శకంగా పనిచేయాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీపీఓలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తూ ప్రజలతో మమేకమై నిబంధనల ప్రకారం పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు



జిల్లా కేంద్రంలో విశ్వకర్మ జయంతి ఊరేగింపులో స్వర్ణకార సంఘం నాయకులు

గద్వాలటౌన్/గట్టు : జిల్లా కేంద్రంలో శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి ఆ సంఘం నాయకులు పూజలు చేశారు. జెండా ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన ఊరేగింపు శోభయామానంగా సాగింది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విశ్వకర్మ చిత్రపటానికి ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టర్ సంతోష్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎస్పీ శ్రీనివాసరావు, అడిషినల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కరాటే సత్యం, సుదర్శనాచారి, శంకరయ్య ఆచారి, భీష్మాచారి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

☆ గట్టులోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవేంద్రాచారి, వెంకటేష్ ఆచారి, బల్గెర ఉరుకుందు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

ఇటిక్యాల: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ పథకం దోహదపడుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలసి స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ పథకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామ, మండలస్థాయిలో కార్యక్రమం జరుగుతుందన్నారు. 20తేదీన చిన్నపిల్లల వైద్యులు, దంత వైద్య నిపుణులు పీహెచ్‌సీకి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఆయుష్ డాక్టర్ ముబీనా తబసుమ్, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సిబ్బంది లత అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పెద్దపల్లి రైతువేదికలో మాట్లాడుతున్న సీడీపీఓ అక్ష్యదీప్తి

మల్దకల్: పౌష్టికాహారంతో గర్భిణి, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ అక్ష్యదీప్తి, డాక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. పోషణ మాసంలో భాగంగా బుధవారం మండలంలోని పెద్దపల్లి రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో పోషణ మాసం నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సమయానుసారంగా కేంద్రాలను కొనసాగించాలన్నారు. బడిబయట చిన్నారులను గుర్తించి వారికి బడిలో చేర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వాసంతి, సుధారాణి, తెల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన అలవాట్లు నేర్పాలి

మానవపాడు: చిన్నారులకు మెరుగైన ఆహార అలవాట్లు నేర్పాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత అన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు నిర్వహించనున్న 'వోకల్ ఫర్ లోకల్' పేరుతో పోషణమాస కార్యక్రమాన్ని అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, ఆస్మా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత విషయంలో రాజీపడొద్దు



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కేటీదొడ్డి: మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఇర్కిచేడు, పాగుంట, ముసల్‌దొడ్డి, రంగాపురం పాఠశాలలో ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేసి చేశారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంట ఏజెన్సీలతో మాట్లాడి భోజనం విషయంలో ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాపయ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ద్వంద్వ వైఖరి తగదు

గద్వాలటౌన్: జిల్లా ఉన్నతాధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘించడంతో పాటు నాయకుల పట్ల ద్వంద వైఖరిని అవలంభిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప ఆరోపించారు. బుధవారం గ్రంథాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు ప్రతిసారి ప్రోటోకాల్‌లో వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. జిల్లా ఉన్నతాధికారులే ప్రోటోకాల్ పాటించకపోతే ఎలా అని ఆందోళన వ్యక్తం చేశారు. గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్‌ను వేదికపై కూర్చోబెట్టి, మమ్మల్ని ఆహ్వానించకపోవటం ఏంటని ప్రశ్నించారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సైతం తమని అవమానించే విధంగా మాట్లాడారని ఆరోపించారు. బీసీ నాయకులమైన తమని వేదికపై కూర్చోనివ్వకుండా అడ్డుతగిలాడని ఆరోపించారు. భవిష్యత్తులో ప్రోటోకాల్ వివాదాలు తలెత్తకుండా చూడాలని కోరారు.

కారు, బైక్ ఢీ.. ఐదుగురికి గాయాలు

మల్దకల్: కారు బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయపడిన ఘటన బుధవారం మండలంలోని తాటికుంట స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిలపల్లికి చెందిన సత్యానారాయణ కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయం వెళ్లి తిరిగి మల్దకల్ నుంచి అయిజకు కారులో వస్తున్న క్రమంలో తాటికుంట స్టేజీ వద్ద బైక్‌పై మద్దెలబండకు చెందిన సత్యన్న వస్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. బైక్‌పై ఉన్న సత్యన్న తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు



కేటీదొడ్డిలో మోదీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసిన బీజేపీ నాయకులు

కేటీదొడ్డి/ఎర్రవల్లి/శాంతినగర్: కేటీదొడ్డి మండలంలోని పాగుంట పాఠశాలలో బుధవారం ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో చాకలి వీరేష్, భీంరెడ్డి, రంగస్వామి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

☆ ఎర్రవల్లి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నాయకులు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

☆ భారతదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపేది ప్రధాని నరేంద్ర మోదీయేనని బీజేపీ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ప్రధాని 75వ జన్మదినాన్ని సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో శాంతినగర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డితో కలిసి రక్తదాన శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ఆమె ప్రారంభించారు. 114 యూనిట్ల రక్తం ఇవ్వడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో స్వచ్ఛత ఉత్సవాలు

అలంపూర్: మున్సిపాలిటిల్లో స్వచ్ఛత ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శంకర్ తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటీలో ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్వచ్ఛతాహీ సేవా-2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్, వార్డు అధికారులు, కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలోని గాంధీ చౌక్ వరకు ప్లకార్డులను ప్రదర్శిస్తు ర్యాలీ చేశారు. మహాత్మడి విగ్రహం వద్ద స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు.

'నానో'పై అవగాహన ఏది?

- నానో ఎరువుల వినియోగంపై అనాసక్తి
- క్షేత్రస్థాయిలో అవగాహన కరువు



కొర్విపాడులో మందు పిచికారీ చేస్తున్న రైతు

మానవపాడు: సాగులో ఖర్చులు తగ్గించి అధిక దిగుబడి సాధించేందుకు విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రైతుల పంటలకు వేస్తున్న గుళికల రూపంలో ఉన్న యూరియా వల్ల భూసారం దెబ్బతింటుంది. యూరియా వినియోగాన్ని తగ్గించేలా నానో యూరియా(ద్రవ రూపంలో)ను అందుబాటులోకి వచ్చింది. కానీ వీటి వినియోగంపై అన్నదాతల్లో సరైన అవగాహన లేకపోవడంతో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. ఎలా వినియోగించాలి, పంటకు ఎంత మేర అవుతుందనే దానిపై అవగాహన కొరవడింది. దీంతో రైతన్నలు సాధారణ ఎరువుల వైపే మొగ్గు చూపుతున్నారు.


ప్రయోజనాలెన్నో

నానో యూరియాతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. సాధారణ యూరియా పంటకు చల్లడం ద్వారా 30 శాతం మాత్రమే మొక్కకు చేరుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. యూరియా ఖర్చు ఎక్కువ.. నానో యూరియాతో తక్కువ ఖర్చు ఉంటుందని, 80 శాతం పంటకు అందుతుంది. అర లీటర్ సీసాలో లభించే నానో యూరియా 45 కేజీల యూరియా బస్తాతో సమానం. రాయితీ పోను బస్తా ధర రూ. 266 ఉండగా, నానో యూరియా రూ.240 లభ్యమవుతుంది. సాధారణంగా ఎకరాకు అర లీటర్ నానో యూరియా సరిపోతుంది. యూరియా తర్వాత రసాయన నానో డీపీపీని అందుబాటులో ఉంది. ఒక బస్తా డీఏపీకి 500 మి.లీ. నానో డీఏపీ సీసాతో సమానం. బస్తా డీఏపీ ధర రూ. 1350 ఉండగా, నానో డీఏపీ రూ. 600కే లభిస్తుంది. ఖర్చు తక్కువతో పాటు పంటకు కావాల్సిన యూరియా సరిపడా అందుతుంది.

అవగాహన సదస్సులు కరువు

అలంపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో దాదాపు 124 గ్రామ పంచాయతీల్లో 2.75లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రతి రైతు వ్యవసాయ పంటకు సాధారణ యూరియా, డీఏపీని వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో నానో యూరియా, డీఏపీ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. చాలా మంది రైతులు అవగాహన లేక నానో యూరియాను వినియోగానికి సుముఖత చూపడ లేదు. దీంతో సాధారణ ఎరువుల వైపే మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.


నానో యూరియా వాడాలి



రైతులు నానో యూరియాను పంటలకు వినియోగించాలి. ధర కూడా అందుబాటులో ఉంది. పంట కూడా లాభసాటిగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించేలా వ్యవసాయ అధికారులు చొరవ చూపాలి.

– మహ్మద్ సిరాజ్, జిల్లా డీసీసీ మెంబర్

అవగాహన కరువు



రైతులకు పూర్తిస్థాయిలో నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించడం లేదు. వ్యవసాయ క్లస్టర్ల వారీగా రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి నానో యూరియా, డీఏపీ గురించి రైతులకు పూర్తిస్థాయి ఫలితాలపై అవగాహన కల్పించాలి.

– పురుషోత్తం, రైతు, చెన్నిపాడు

రైతులకు ఎంతో మేలు

నానో యూరియా వాడకంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. సాధారణ యూరియా కంటే నానో యూరియా వాడకంతో ఎంతో మేలు చేకూరుతుంది. మండలంలో పలువురు రైతులు ఇప్పటికే నానో యూరియాను వాడుతున్నారు. పంటలకు నానో యూరియా ఎక్కువ మొత్తంలో త్వరగా చేరుతుంది.

– సక్రియానాయక్, డీఏఓ గద్వాల జిల్లా